సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మల్కాపురం:** శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ములగాడ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్ 2 ఈఈ బి.కె. నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిలకవానిపాలెం, అన్నపూర్ణనగర్, ఉప్పర కాలనీ, రామ్‌నగర్, శ్రీరామ్‌నగర్, గుల్లలపాలెం, అశోక్‌నగర్, బర్మాకాలనీ, ఎదురవానిపాలెం, గొందేశివానిపాలెం, హనుమాన్‌సంజీవ్‌కాలనీ, హిమాచల్‌నగర్, గణేష్‌నగర్, జింక్ గేటు ఏరియా, లక్ష్మీనగర్, పవన్‌పుత్రకాలనీ, కోడిపందాలదిబ్బ, శ్రీహరిపురం మెయిన్‌రోడ్డు ఏరియా, ఎంఐజీ–1,2, ఇందిరాకాలనీ–1,2, ములగాడ విలేజ్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ, గణపతినగర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకుంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కంచరపాలెం:** జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లో 11 కేవీ కంచరపాలెం ధర్మానగర్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్ ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గానగర్, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం, రెడ్డికంచరపాలెం, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్, తోటవీధి, మల్లసూరివీధి, తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### ఆదిత్యా డిగ్రీ కళాశాలలో రక్త దాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**గోపాలపట్నం:** గోపాలపట్నం ఆదిత్యా కళాశాలలో బుధవారం నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీ మోహనరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల దాతల ఆరోగ్యంగా బాగుంటుందని.. మీరు ఇచ్చిన రక్తం ప్రాణాలు నిలబెట్టేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. విశాఖ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి టి. గణపతి రావు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

### టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

**కంచరపాలెం:** జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు విద్యార్థు లకు అందజేశారు. బయాలజీ ఉపాధ్యాయుడు పి.చంద్రశేఖర్, ఇతర సబ్జెక్ట్ ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో సుమారు 166 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం, సత్యనారాయణ, పరమేశ్వరరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

### జీతాలు చెల్లించాలని ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

**పెదగంట్యాడ:** నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉక్కు ఉద్యోగుల జీతాలను వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటక్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, కారు రమణ, గొందేశి మహేశ్వరరెడ్డి, మంత్రి గోపీ నారాయణ, పోలీస్ నాయుడు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో చిల్లర దొంగలు అలజడి సృష్టిస్తున్నారు. వ్యసనాలకు బానిసైన వారు రోడ్డు వెంబడి పార్కింగ్ చేస్తున్న వాహనాల బ్యాటరీలు, పెట్రోల్ చోరీ చేస్తున్నారు. దీంతో కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య ఎక్కువగా హెచ్‌పీసీఎల్ వంటి ప్రాంతాల్లో అధికంగా ఉంది.


హెచ్‌పీసీఎల్ సీ గేటు రక్షణ గోడకు ఆనుకుని పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు

# బాబోయ్.. బ్యాటరీ దొంగలు!

**హెచ్‌పీసీఎల్ ఎదుట పార్కు చేస్తున్న వాహనాల నుంచి బ్యాటరీలు చోరీ**

**పెట్రోల్, బ్యాటరీలు, వాహనాలను దొంగలిస్తున్న వైనం**

**మల్కాపురం:** హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో విస్తరణ పనులు, నిర్వహణ పనులు, వివిధ కాంట్రాక్టర్ల వద్ద విధులు నిర్వహిస్తున్న వారు రోజూ సుమారు రెండు వేల మంది విధులకు హాజరవుతారు. వీరంతా అనకాపల్లి,పరవాడ,అగనంపూడి,గాజువాక,గోపాలపట్నం ఇలా పలు ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. వాస్తవానికి ఇలా వచ్చే కార్మికులకు సంస్థ పార్కింగ్ స్థలం కేటాయించాల్సి ఉంది. కానీ వారు నిర్లక్ష్యంగా ఉండడంతో కార్మికులు హెచ్‌పీసీఎల్ సీ గేటు ఎదురుగా గల సేవా మార్గం,యారాడ పార్కు ఎదురుగా తమ ద్విచక్ర వాహనాలు పార్కు చేస్తుంటారు. అయితే వీరికి దొంగల భయం పట్టుకుంది. ఉదయం 8 గంటలకు విధులకు వచ్చే కార్మికులు సాయంత్రం విధులు ముగించుకుని తమ వాహనాల వద్దకు వచ్చే సరికి ఆ వాహనాలు స్టార్ట్ కాకపోవడంతో వీరిలో ఆందోళన మొదలవుతుంది. కొన్ని వాహనాల బ్యాటరీలు మాయం అవుతున్నారు. మరికొన్ని వాహనాల్లో పెట్రోల్ ఖాళీ అయిపోతుంది.దీంతో కార్మికులు బతుకుజీవుడా అంటూ ఆ వాహనాలను నడిపించుకుని వెళ్లాల్సిన పరిస్థితి కలుగుతుంది.

**వారంలో మూడు బ్యాటరీలు మాయం**

**గడిచిన వారంలో ఇక్కడ పార్కు చేసిన మూడు వాహనాల నుంచి బ్యాటరీలు పోయినట్టు వాహనదా**రులు పేర్కొంటున్నారు. పెట్రోల్ దొంగల పాలు అయిందని పలువురు వివరిస్తున్నారు.వీటితో పాటు ఐదు నెలల్లో ఇక్కడ పార్కు చేసిన మూడు ద్విచక్ర వాహనాలను దొంగల పాలయ్యాయి. వీటిలో ఒక వాహనం దొరకగా.. ఇంక రెండు వాహనాలు కనిపించలేదు. కాగా ద్విచక్ర వాహనాల నుంచి బ్యాటరీ దొంగలిస్తున్నారన్న అనుమానంతో ఓ యువకుడిని క్రైం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


యారాడ పార్కు రక్షణ గోడకు ఆనుకుని నిలిపిన ద్విచక్ర వాహనాలు

#### యారాడ పార్కు వద్ద బ్యాటరీ చోరీ

గతేడాది సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై యారాడ పార్కు వద్ద ఓ షాపు వద్దకు వెళ్లాను. పని ముగించుకుని తిరిగి నా వాహనం వద్దకు రాగా ద్విచక్ర వాహనంలో బ్యాటరీ మాయం అయింది. నేను మెకానిక్ కాబట్టి నా వాహనాన్ని సరి చేసి నడిపించుకోగలిగాను.

– సమ్మిడి రాజు, మెకానిక్

#### స్నేహితుడి వాహనం చోరీ



హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద నా స్నేహితుడు పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీ అయింది.నా వాహనం సాయంతో స్నేహితుడుని వారి ఇంటి వద్ద దించాను.దీనిపై అప్పట్లో మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.

– నూకరాజు, ద్విచక్ర వాహనదారు

## వైఎస్సార్‌సీపీ‘పశ్చిమ’ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



**గోపాలపట్నం:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

| విభాగం | అధ్యక్షుల పేర్లు |
|---|---|
| యూత్ వింగ్ | నగిరెడ్డి కిరణ్ |
| మహిళా విభాగం | పేడాడ జ్యోత్స్న |
| బీసీ సెల్ | నమ్మి వెంకట కృష్ణ మూర్తి |
| ఎస్సీ సెల్ | పీడీ మల్లేశ్వరరావు |
| ఎస్టీసెల్ | దాసరి శామ్యూల్ |
| మైనారిటీ సెల్ | షేక్ గౌస్ మొహిద్దీన్ |
| క్రిస్టియన్ మైనారిటీ సెల్ | డాక్టర్ చింతా ప్రభాకర్ |
| స్టూడెంట్ వింగ్ | లెంక జ్ఞానరావు(కార్తీక్) |
| మున్సిపల్ వింగ్ | పిల్లా కన్నబాబు |
| ఆర్‌టీఐ వింగ్ | భీశెట్టి లక్ష్మీ ప్రసన్న సంతోష్ |
| వలంటీర్ వింగ్ | కోడ కన్నబాబు |
| గ్రీవెన్స్ సెల్ | కొణతాల వెంకటనరసింహారావు |
| వాణిజ్య విభాగం | చందపు గుణేశ్వరరావు |
| వీవర్స్ వింగ్ | కొన్నవల చిన్నబాబు |
| వైఎస్సార్ టీయూసీ | భూపతి నాయుడు |
| అంగన్‌వాడీ వింగ్ | ఐ. భారతి |
| లీగల్ సెల్ | పైల మాధవి |
| కల్చరల్ వింగ్ | ముత్తిరెడ్డి రేణుక |
| సోషల్ మీడియా వింగ్ | తంతటి సంపత్‌కుమార్ |
| ఐటీ వింగ్ | ఉమ్మిడి బాలమురళి(చిన్ని) |
| దివ్యాంగుల విభాగం | పెద్దాడ ఈశ్వరరావు |
| బూత్ కమిటీలు | యల్లపు వెంకటేశ్వరరావు |
| పబ్లిసిటీ వింగ్ | మళ్ల శ్రీనివాసనాయుడు |

## కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై పెరిగిన దాడులు

**బొల్లవరపు జాన్ వెస్లీ**


క్రైస్తవ గీతాల డీవీడీ విడుదల చేస్తున్న జాన్‌వెస్లీ

**సీతమ్మధార:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని, అందరం కలిసి ఎదుర్కొందామని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. గురుద్వార దగ్గర గల ఎస్‌సీకే క్రైస్ట్ చర్చిలో బుధవారం నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ (నిబ్) 24వ రాష్ట్రస్థాయి క్రైస్తవ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్‌ఐబీ ఫౌండర్, అధ్యక్షుడు కాట్రగడ్డ మార్టిన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో నిబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలను వివరించారు. రెవరెండ్ మార్టిన్ లూథర్ దామెర మాట్లాడుతూ ఏసు దైవ గుణాలను, క్రైస్తవ్యం సిద్ధాంతాలను ఏ విధంగా అనుసరించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటే కృతజ్ఞతకు చిహ్నం అని అన్నారు. ఈనెల 26న శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కల్వర్ బాప్టిస్ట్ చర్చి సభ్యులపై జరిగిన దాడి, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో పాస్టర్ చింతాడ రాజారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రైస్తవులందరూ తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. క్రైస్తవ సంఘ కాపరులకు 8 నెలలుగా గౌరవ వేతనం, జెరూసలేం వెళ్లే యాత్రికులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలన్నారు. అనంతరం క్రైస్తవ గీతాల డీవీడీని జాన్ వెస్లీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అతిథులను సత్కరించారు. రెవరెండ్ ఎం.ఎ. పాల్, నిబ్ ఏపీ సెక్రటరీ బిషప్ సత్యకిరణ్ పాల్గొన్నారు.

## మెయిన్‌డ్రా టెన్నిస్ పోటీలు ప్రారంభం


డ్రాప్ షాట్ చేస్తున్న నగేష్, బంతిని ప్రత్యర్థి కోర్టులోకి రిటెన్ చేస్తున్న సౌమిత్రి

**విశాఖ స్పోర్ట్స్:** ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నీ(ఐస్టా) మెయిన్ డ్రా పోటీలు గురువారం ఆఫీసర్స్ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. సీనియర్స్ ర్యాంకింగ్ ఆటగాళ్లతో పాటు క్వాలిఫైయింగ్ రౌండ్లలో అర్హత సాధించిన వారు 35+–75+ వరకు ఐదు కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీ పడుతున్నారు. అండర్ 45+లో హోరాహోరీగా సాగిన రెండో రౌండ్ బి.నవీన్, కెఆర్‌కే కుమార్‌లు చెరో ఎనిమిదేసి పాయింట్లతో సముజ్జీగా నిలవగా టై బ్రేక్‌లో నవీన్ విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరో పోటీలో క్వాలిఫైయిర్‌తో తలపడిన శంకర్‌నాయుడు 9–4తో విజయం సాధించాడు. 35+లో నితీష్ జాక్సన్‌తో కిరోన్ సముజ్జీగా నిలవగా టై బ్రేక్‌లో కిరోన్ విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. పి.అనిల్‌పై వై.సురేష్, దీపు చంద్రపై సచిన్‌శర్మ, అమిత్‌రెడ్డిపై రెండో సీడ్ కర్నన్‌సేతు విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరుకోగా నగేష్ సునాయాసంగానే నగేష్‌రెడ్డిపై విజయం సాధించాడు. 55+లో గంగాధర్‌పై శివషణ్ముగం, మహేష్ కేశవ్‌పై రమేష్ విజయం సాధించగా టాప్ సీడ్ సుధాకర్‌రెడ్డి 9–2తో లూయిస్‌పై విజయం సాధించాడు.

## లారీ ఢీ కొని మహిళ మృతి

**అక్కిరెడ్డిపాలెం:** సైకిల్‌పై వెళ్తున్న మహిళను లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బుధవారం జరిగిన ప్రమాదంపై దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 69వ వార్డు తుంగ్లాంలో ముగ్గురు సంతానంతో కింతాడ దేవి (దేవుడమ్మ) (35) నివాసం ఉంటుంది. భర్త వదిలేయడంలో ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. బుధవారం వడ్లపూడిలో కూలి పనులు ముగించుకుని సైకిల్‌పై తుంగ్లాంలో తన నివాసానికి వస్తుంది. సాయంత్రం 7 గంటల సమయంలో వెనుక నుంచి ఆమెను లారీ వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో దేవి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## పర్యావరణ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఇంజినీర్, గ్రీన్ క్లైమేట్ టీం సభ్యులు

**మద్రిపాలెం :** పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ అందరికీ అవసరమని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుంద అన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 51వ వార్డు మాధవధార పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో ముద్రించిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవాల క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ రోజులన్నీ పొందుపరచడం వల్ల విద్యా సంస్థల్లో ఈ క్యాలెండర్ ఉంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ సూర్యకళ, ఆంధ్రా యూనివర్సిటీ రీసెర్చ్ రంగాచార్యులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కో ఆర్డినేటర్లు ఐ.కృష్ణకుమారి, జె.రవితేజ, గ్రీన్ వలంటీర్ రాజేశ్వరి, వనమాలి గార్డెన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రథయాత్ర ప్రారంభం


రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

**గాజువాక:** ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వుడా కాలనీ శాఖ ఆధ్వర్యంలో సోమనాథేశ్వర వజ్రలింగ రథయాత్ర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ యాత్రను 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో నైతిక విలువలు పడిపోయాయని, అశాంతి నెలకొందని అన్నారు. ప్రజల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు బ్రహ్మ కుమారీ సంస్థ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత, డాక్టర్ పంకజ్, న్యాయవాది అండిబోయిన లక్ష్మి, రథ నిర్వాహకులు సుభాష్, మణి, శాంతి, శ్రీనివాసరావు, నందికి తాతారావు, స్థానిక నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్ పాల్గొన్నారు.

## ‘మత్తు’తో జీవితాలు చిత్తు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

**పెందుర్తి:** మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వాడకంతో జీవితాలు నాశనమవుతాయని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. బుధవారం నరవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‘యాంటీ డ్రగ్స్’అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యుక్త వయసులో తెలిసీ తెలియక డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారంలాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలన్న సంకల్పంతో ముందడుగు వేయాలన్నారు. అనుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించి, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం పాడుచేసుకోవడంతో పాటు సమాజంలో చులకన అవుతారని హెచ్చరించారు. సానుకూల దృక్పథంతో ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని అత్యున్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## 7.2 కేజీల గంజాయి స్వాధీనం

**తాటిచెట్లపాలెం :** విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బుధవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, సీఐబీ/వాల్తేర్/ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పిమ్‌కుమార్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒడిశా రాష్ట్రంలోని రాయగడ జిల్లాకు చెందిన సుశాంత్ నాగ్, రాజకుమార్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

## ‘స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి’

**పరవాడ:** విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాత కార్యక్రమానికి లంకెలపాలెం కూడలిలో కార్యకర్తలు బుధవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ కాకుండా ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విశ్రాంతి గదులపై కొరవడిన పర్యవేక్షణ


సింహాచలం రైల్వే స్టేషన్‌లో తలుపులు తెరిచి ఉన్న విశ్రాంతి గదులు

**గోపాలపట్నం:** సింహాచలం రైల్వే స్టేషన్‌లో విశ్రాంతి గదులను పర్యవేక్షణ కొరవడింది. ఈ గదులకు తాళాలు లేకపోవడం, పర్యవేక్షించే వారు లేకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. వివరాలివి.. ఇక్కడ రైల్వేస్టేషన్‌లో ఏసీ, స్లీపర్ క్లాస్ ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్లాట్‌ఫాంపై గదులు ఉన్నాయి. అలాగే మహిళల విశ్రాంతి గది ఉంది. గతంలో రైలు వచ్చినపుడు ఈ గదులను తెరిచి ఉంచడం, రైలు వెళ్లిపోయిన తరువాత ప్రయాణికులు లేకపోతే వాటికి తాళాలు వేయడం చేసేవారు. అయితే, గత కొద్దికాలంగా ఈ గదుల తలుపులు తెరిచే ఉంచడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని వాపోతున్నారు. గతంలో ఇక్కడి టాయ్‌లెట్ల వద్ద మహిళపై అత్యాచారం జరిగిన ఘటనను గుర్తు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఆ గదులకు తాళాలు వేయడం గానీ, లేదంటే సంరక్షకుడిని నియమించడం గానీ చేయాలని కోరుతున్నారు.

## డీఎంహెచ్‌వో ఆకస్మిక సందర్శన


అక్కిరెడ్డిపాలెంలో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

**అక్కిరెడ్డిపాలెం:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు బుధవారం అక్కిరెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం సచివాలయంతో పాటు ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఆర్ – 1, ఎంఆర్ – 2 బ్యాక్లాగ్స్ గురించి, ఓపీ, ఐపీ సేవలు, ఆర్‌కేఎస్ మొదలైన కార్యక్రమాలపై మెడికల్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ హాజరు విధిగా వేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అభ ఐడీ మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు జాతి ఆకాంక్షలపై విధ్వంసం ఆపాలి

**అగనంపూడి:** తెలుగు జాతి ఆశలు, ఆకాంక్షలపై కేంద్ర ప్రభుత్వం విధ్వంసకరమైన చర్యలకు ఒడిగడుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పరంధామయ్య ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1448వ రోజు రిలేదీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు మంత్రిత్వ కార్యదర్శి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి విశాఖ ఉక్కు సందర్శనలో భవిష్యత్ కార్యాచరణ పేరుతో చర్చలు జరుపుతామని చెప్పడం ఓ నాటకంలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిరక్షణలో ఎవరి ఆట వాళ్లు ఆడుతున్నారని, మధ్యలో తెలుగు ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీక్షా శిబిరంలో జేఎంఎస్, యూఐ, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ సంఘాల నాయకులు కూర్చొన్నారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, డేవిడ్, జీఆర్‌కె నాయుడు, టి.జగదీష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

**ఎంవీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు**



**అగనంపూడి:** రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, వాహనచోదకులపై కూడా ఉందని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, పరిమిత వేగంతో ప్రయాణించడం వాహనచోదకుల బాధ్యత అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై మాత్రమే పోలీసులు దృష్టి సారించగలరన్నారు. అదుపుతప్పిన వేగం, హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడమే ప్రమాదాలకుఎక్కువగా కారణం అవుతున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ పిన్నింటి సన్యాసిరావు, డీన్ బి.సతీష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com